జిల్లెళ్ళమూడి అమ్మ ప్రేమతత్వం



రచన

డాక్టర్ బి.యల్.సుగుణ

ప్రచురణ

విశ్వజననీట్రస్ట్ - హైద్రాబాదు

శ్రీ విశ్వజననీట్రస్ట్ హైదరాబాద్ ప్రచురణ

అమ్మకళ్యాణదినోత్సవం
5.5.2006

వందన శతాలు

నన్ను కన్న తల్లిదండ్రులు

తలగడదీవి వెంకట సుబ్బారావు సీతారామమ్మలకు

నన్ను ప్రోత్సహించిన అడవులదీవివారు

శ్రీ యల్లాప్రగడ మధుసూదనరావు - లలితలకు

నన్నాదరించిన అక్కా బావగార్లు

డాక్టర్ కోన సత్యనారాయణ - రాజ్యలక్ష్మిలకు

అడుగడుగునా అండగా నిలచిన

వసుంధరక్కయ్యకు - రామకృష్ణన్నయ్యకూ

తన అర్ధభాగాన్నిచ్చి మనసులో నన్ను నిండుగా నింపుకున్న శ్రీవారు

శ్రీ రామచంద్రగారికి

ఈ రచనకు నన్ను ప్రోత్సహించిన

శ్రీ వల్లూరి పాండురంగారావు అన్నయ్యకు

వీటన్నింటికీ అంతస్సూత్రంగా అన్నింటినీ ఆవరించి

నడిపించిన అవ్యాజవాత్సల్య స్వరూపిణి

అమ్మ శ్రీఅనసూయాదేవికి

శతశతానేక వందనాలు

— సుగుణ

జిల్లెళ్ళమూడి అమ్మ - ప్రేమతత్వం

విశ్వంభరాభ్రమణానికి మూలం శాశ్వత చైతన్యమయినట్లే ఎన్నో కోట్ల సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా సాగే ఈ సృష్టి క్రమం కొనసాగడానికి మూలం కరుణా నిర్భరమైన సృష్టి కర్త ప్రేమసూత్రం. గాలిపాటలు పాడుకుంటూ ఎగిరే తుమ్మెదలకు పూలకంచాలలో తేనె లొడ్డించటం, కళ్లు తెరవని పసికందు కేరు మనగానే తల్లిస్తన్యం సంసిద్ధపరచడం, ఒంటితడి ఆరని లేగదూడ తల్లిపొదుగుకై తడుముకోవడం, మొలకగా మారాలని పరితపించే విత్తనం దాహార్తికి వాన చినుకు వర్షించడం - ఇవన్నీ సృష్టిలో అంతర్లయగా కొనసాగే ప్రేమతత్త్వానికి ప్రతీకలు.

సృష్టే ప్రేమమయం అనే విషయం కరుణశ్రీ కలంనుండి జాలువారిన ఈ క్రింది పద్యంలో పరికించవచ్చు.

'ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీచక్ర
మిరుసులేకుండనే తిరుగుచుండు
ఏ ప్రేమ మహిమచే నెల్ల నక్షత్రాలు
నేలరాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమ మహిమచే పృథివిపై బడకుండ
కదలిరాయడు కాళ్లుముడుచుకొనును
ఏ ప్రేమ మహిమచే నీరేడు భువనాల
గాలిదేవుడు సురటీలు విసరు
ఆ మహాప్రేమ - శాశ్వతమైన ప్రేమ
అద్భుతమఖండమవ్యక్తమైన ప్రేమ
నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల'

అనంతమైన తత్త్వం ఆవిష్కరింపబడాలంటే ఆకృతి అవసరం. చూసే శక్తి ఉన్నా కన్నులేనిదే వస్తు దర్శనం జరగదు గదా ! శక్తి పదార్థాన్ని ఆశ్రయిస్తేనే కార్యకారి అవుతోంది. అలాగే సృష్టికి మూలమైన ప్రేమతత్త్వం ఆకృతి ధరించి కరచరణాదులతో సజీవంగా కదిలివస్తే అది అమ్మ. అందుకే అమ్మ హృదయం ప్రేమతత్త్వానికి ప్రతీక. అమ్మ జీవితంలో ప్రతి సన్నివేశమూ ప్రేమతత్త్వానికి పతాక.

లోకంలో మనమనుకునే ప్రేమకు అర్థం వేరు. అనుబంధాలను బట్టి అది అనేక విధాలుగా గోచరిస్తుంది. తల్లిదండ్రులకు తన బిడ్డలపై గల ప్రేమ మమకారం అనీ, భార్యాభర్తలకు పరస్పరం గల ప్రేమ అనురాగమనీ, పెద్దలపై గల ప్రేమ

గౌరవమనీ, భగవంతునిపై గల ప్రేమ భక్తి అనీ రూపాంతరాలుగా కన్పిస్తున్నా అన్నింటా ప్రేమే మూలం. కానీ ఇవన్నీ సవ్యాజమైనవే. సాధారణంగా ప్రేమ అంటే ఇచ్చి పుచ్చుకునేదే. ఎదుటి వ్యక్తి గుణగణాలను బట్టి వారికీ మనకున్న అనుబంధాన్ని బట్టి హెచ్చు తగ్గులు ఉండవచ్చు. ప్రేమకు ప్రతిరూపాలైన తల్లిదండ్రులు కూడ తమ బిడ్డల నుండి ప్రతిఫలంగా ప్రేమను కోరుకుంటారు. కాని అమ్మ 'కారణాలతో కూడింది ప్రేమకాదు అవసరం' అన్న ఒక్క మాటతో మనమనుకునే ప్రేమకు సరిక్రొత్త అర్థాన్ని చెప్పింది. ఎదుటివారెవరయినా, ఎలాంటి వారయినా, ఏం చేసినా మనం ప్రేమించగలిగితే అదే నిజమైన ప్రేమ.

'రామో విగ్రహవాన్ ధర్మః' అని ధర్మమే మూర్తీభవిస్తే రాముడైనట్లుగా వాత్సల్యామృతాన్ని వర్షించడానికీ, ఆధివ్యాధులతో తపించే సమస్త ప్రాణికోటికీ చలువపందిరై నిలువడానికీ మూర్తీభవించిన ప్రేమావతారం అమ్మ. 'అవ్యాజప్రేమ కాదు. ప్రేమే అవ్యాజమైంది' అని అపూర్వంగా నిర్వచించిన అమ్మ అవ్యాజప్రేమకు సాకారం. 'నీవెవరివమ్మా' అని ఎవరో ఒకసారి ప్రశ్నిస్తే నేను అమ్మను, నీకు, మీకూ అందరికీ' అని సమాధానం చెప్పిన అమ్మ ఒడిలో అందరూ సమానమే. ఆ అనురాగ ప్రసారంలో హెచ్చుతగ్గులు లేవు. వయోభేదం కానీ, లింగభేదం కానీ, జాతి, మత, కుల, వర్గ భేదం కానీ ఏమీ లేవు. గడ్డాలు నెరసిన తాతలు కూడా అడ్డాలబిడ్డలే. ఇంతవరకూ చరిత్రలో కనీ వినీ ఎరుగనిది అమ్మకు ఎపుడు ఎవరిని చూసినా తన బిడ్డయే అన్పించడం. 'నేనే కని మీ మీ తల్లులకు పెంపుడిచ్చినట్లు అన్పిస్తుంది అని చెప్పింది అమ్మ. 'మా మీద నీకెందుకింత ప్రేమ' అని ఒకరు ప్రశ్నిస్తే మీరు నాకేదో చేయాలని నేనెప్పుడూ అనుకోను. ప్రేమ నాకు సహజం అని ప్రకటించింది. ఏ విచక్షణా లేకుండా ఎల్లరకూ తన ఎనలేని ప్రేమను పంచిపెట్టడం అమ్మ తత్త్వం.

'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

అన్న గీతా వచనం ప్రకారం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాత్ములు అవతరించి దుష్టశిక్షణ గావించడం యుగయుగాల్లో జరిగినట్లు తెలుస్తోంది. ఏ విషయానికయినా ఉద్దేశం, విధేయం అని రెండూ ఉంటాయి. ధర్మ సంస్థాపన ఉద్దేశమయితే సాధురక్షణ విధేయం. ఆ రక్షణలో భాగంగా ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ లోక కంటకులుగా ఉన్న దుర్మార్గుల్ని సంహరించవలసిన అవసరం రావచ్చు. "నాటిన పైరు పైకి ఎదిగి మంచి పంట పండాలంటే కలుపు మొక్కలను ఏరి పారెయ్యాలి కదా. కలుపు మొక్కలను ఏరటం కోసం పంటవేయం కదా ! దుష్టశిక్షణ చేయడమే

వారి ఉద్దేశ్యం కాదు. సమాజ స్థితిని కాపాడడమే మహనీయుల ఉనికికి పరమార్థం. ఆయా యుగధర్మాలను బట్టి సమాజ పరిస్థితిని బట్టి ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గాన్ని అనుసరించారు.

'పరద్రవ్యావహారో అన్యస్త్రీ హరో మే భ్రాతరౌ మాతా
ప్రపంచ దంభ మాత్సర్య కర్తా ప్రాణసఖో మమ
నాతఃపరం పరంమిత్రం మమ జీవసమం విభో
యే పుణ్యకారిణో లోకాః తే సర్వే మమశత్రవః'

అని కలి పురుష లక్షణాలు పురాణాల్లో చెప్పబడ్డాయి. మరి ఈ లక్షణాలతో కూడిన ఈ కలియుగ మానవులను ఉద్ధరించడం ఎలా సాధ్యం.

ఈనాడు సమాజంలో మతం పేరుతో మారణ హోమాలూ, రాజకీయం పేరుతో రణరంగాలూ, కులం పేరుతో కుమ్ములాటలూ మనం చూస్తూనే ఉన్నాం. సాంకేతికంగా వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి సాధించినా అందరూ సౌభ్రాతృత్వ భావనతో లేనినాడు ఆ నాగరికతే వినాశనాన్ని కల్గిస్తుంది. అగ్రరాజ్యాలుగా ప్రసిద్ధి చెందిన దేశాల్లో ఉగ్రవాదులు జరిపిన దాడులు వినే ఉన్నాం. ఈనాడు సమాజంలో అన్నీ ఉన్నా బ్రతుకు భయం ఏర్పడింది. మనిషికి సాటి మనిషి వల్లనే ప్రమాదం సంభవిస్తోంది. ఏ క్షణానికి ఆ క్షణం భయం భయంగా బ్రతుకు వెళ్లబుచ్చే పరిస్థితి నేడు. ప్రేమ, కరుణ వాత్సల్యం లాంటి మాటలు ఈనాడు నిలువనీడ లేక నిఘంటువులలో తలదాచు కుంటున్నాయి. ధనదాహం, పదవీ వ్యామోహం. కులమతరాజకీయాలు ఇంతింతై వటుడింతయై అన్నట్లుగా పెరిగి తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. స్వార్థం వెర్రితలలు వేసి జాతి జీవనాన్నే స్తభింప చేస్తున్న కాలమిది. మరి ఇలాంటి సమాజ అవ్యస్థకు కారణం ఏమిటి ? అని ఒక్కసారి పర్యాలోచిస్తే ప్రేమ రాహిత్యమే దానికి మూలం అని అర్థమవుతుంది. విశ్వమనే రథానికి ఇరుసు ప్రేమ. రథచక్రాలెంత బలంగా ఉన్నా ఇరుసు విరిగితే రథం ముందుకు సాగదనేది జగమెరిగిన సత్యం.

ఈనాటి సమాజస్థితిని కాపాడడానికి అత్యంత బలమైన శక్తివంతమైన ఆయుధం ప్రేమ ఒక్కటే. కనుక ఈ యుగధర్మాన్ని బట్టి దుష్టులలోని దుష్టత్వాన్ని సంస్కరించాలంటే క్షమారూపిణి అయిన తల్లికే సాధ్యం. యోగ్యతా యోగ్యలతో నిమిత్తం లేని అవ్యాజప్రేమ ఒక తల్లియందు మాత్రమే చూడగలం. కనుకనే ఈ యుగధర్మాన్ని బట్టి అమ్మ ప్రేమ తత్వాన్నే ఆయుధంగా ఎంచుకున్నది. ఎందరో యోగులూ, సిద్ధులూ, కారణజన్ములుగా కాలగమనంలో ముందుకు సాగి ఉండవచ్చు.

కాని

నేను గురువును కాను - మీరు శిష్యులు కారు

నేను దైవాన్ని కాను - మీరు భక్తులు కాదు

నేను అమ్మను - మీరు బిడ్డలు, అని తన అసాధారణ మాతృత్వాన్ని ప్రకటించింది అమ్మ మాత్రమే.

అందరినీ బిడ్డలుగా చూసే మాతృత్వ భావంతో బిడ్డల తప్పు గ్రహించినా శిక్షించకుండా ప్రేమతో వారికున్న మనో వైకల్యాన్ని సరిచేసి వాళ్లలో పరివర్తన తీసుకురావాలన్నదే అమ్మ ఆశయం, ఆరాటం. విషపుమొక్కను కాదు విషాన్ని విరిచివేయాలన్నది అమ్మ సిద్ధాంతం. తప్పు చేసిన వాళ్లను జైళ్లలో పెట్టి శిక్షించినంత మాత్రానా వాళ్లలో ఏ మార్పు రాదు. ఈనాడు మానవహక్కులకమీషన్ గాని మరెన్నో స్వచ్ఛందసంస్థలు గానీ నేరస్థులలో పరివర్తన తీసుకురావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుండడం మనం గమనిస్తున్నాం. ఏ వ్యక్తీ పుట్టుకతోనే చెడ్డవాడిగా పుట్టడు. అతని కుటుంబం, చుట్టూ ఉన్న పరిస్థితులు అన్నీ కారణమవుతాయి. వారి పరిస్థితులను అవగాహన చేసుకొని వారి పట్ల సానుభూతి చూపిస్తూ వాళ్ల మనస్సు మారటానికి సాటి మనిషి తోడ్పడుతూ ఉండాలి. తమ కర్తృత్వం ఏమీ లేకుండానే చెడ్డవాళ్లుగా మారిన వాళ్లూ ఉంటారు. వాళ్లను అలక్ష్యం చేస్తే వాళ్లలో నేరప్రవృత్తి పెరిగిపోయి సమాజానికి సమస్యగా మారతారు. అలాకాక ప్రేమతో ఆదరించగల్గితే వాళ్లల్లో కొంతైనా మార్పు వస్తుంది. అలా ప్రతివారూ ఏ ఒక్కరినైనా ఆదరించగల్గితే సమాజంలో క్రమంగా నేరస్తుల సంఖ్య తగ్గిపోయి సమాజ స్వరూపమే మారిపోతుంది. తప్పు అని తెలిసీ మనిష తప్పులు ఎందుకు చేస్తాడు ? అని అడిగితే 'తప్పించుకోలేకనే' అన్న అమ్మ సమాధానం విధి ఎంత బలీయమైందో తెలియచేస్తోంది. నేరస్థులను సమాజాన్నుండి బహిష్కరించకుండా మానవతా దృక్పథంతో వారిలోని నేరప్రవృత్తిని మార్చటానికి తోడ్పడాలన్నది అమ్మ ఆలోచన. ఎంతో ఘోరమైన తప్పులు చేసిన వారిని గూడా క్షమాగుణంతో మన్నించడం, తన మీద కత్తి దూసిన వారిని కూడ 'వాడూ నా బిడ్డేగా' అని అనడం అమ్మకే చెల్లింది. శిక్ష అంటే మనిషిని సంహరించడం కాదు కదా ! గుణాన్ని మార్చటమేనంటూ అమ్మ పాపులను, పతితులను ప్రేమతో ఆదరించి సన్మార్గంలోకి మళ్లించిన సంఘటన లనేకం ఉన్నాయి.

అమ్మ బాల్యంలో ఒకసారి బంధువులతో కలిసి బ్రాహ్మణ కోడూరులో ఉన్న శ్రీవాసుదాసస్వామి వారి దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు దొప్పలపూడికి చెందిన బ్రహ్మయ్యగారి బండి ఎక్కి రావడం తటస్థించింది. వారి జీతగాడు మంత్రాయితో బ్రహ్మయ్యగారు అమ్మను మన్నవలో అమ్మ ఇంటి దగ్గర దించి రమ్మని పంపారు.

మార్గమధ్యంలో మాటల సందర్భంలో అమ్మ అతడి వివరాలన్నీ అడిగింది. తన బంధువులు తీసుకువచ్చి తనను పనిలో ఉంచారనీ, జీతం పదిహేను రూపాయలు ఇస్తారని చెప్పాడు. ఆ డబ్బుతో ఈ సంవత్సరం తన చెల్లెలికి పెళ్లి చేస్తానని చెప్పాడు. ఆ కొద్దిసేపటిలోనే అమ్మకు అతడి పట్ల తెలియని ఆత్మీయత ఏర్పడింది. ఆ తరువాత అమ్మను వారి ఇంటి దగ్గర దింపి వెళ్ళేటప్పుడు అమ్మ ఆ జీతగాడితో 'నాకు నిన్ను వదిలి పెట్టి వెళ్ళాలంటే పురిట్లో బిడ్డను వదిలిపెట్టినట్లుంది నాన్నా' అంటూ అతని చెల్లెలు పెళ్లికని తన చేతిని ఉన్న ఉంగరం తీసి ఇచ్చింది. అవ్యాజమైన అమ్మ ప్రేమను గూర్చి ఆలోచిస్తూ అతడు "అమ్మా! నా మీద నీకెందుకింత ప్రేమ' అని అడిగితే 'నాకు ప్రేమ ఉండటం సహజమే నాన్నా! నా ప్రేమను నీవు గుర్తించడం విశేషం ! అని, అప్పుడప్పుడు వస్తావు గదూ అని అడిగింది అమ్మ.

ఆ తరవాత ఎన్నోసార్లు తనకు ఇంట్లో పెట్టిన అన్నం తీసుకువెళ్లి అతడికి స్వయంగా అమ్మ తినిపిస్తూ ఉండేది. అంతేకాక అతనికి ఇష్టం అయినవి తెలుసుకుని మరీ పెట్టాలని తహతహలాడేది. ఎందుకమ్మా ఈ మాలవాడి మీద ఆదరణ అంటే 'నాన్నా నీవు మాలవాడివి కాదు. మా వాడివి' అని చెప్పింది. మరొకసారి మంత్రాయి అమ్మను కలుసుకున్నప్పుడు తనకు ఎందుకో అమ్మ పాదాల దగ్గరే పడి ఉందా మనిపిస్తోందనీ, కానీ తాను చెడ్డవాడిననీ, అన్నీ తప్పుడలవాట్లేననీ, తాను చేసే పాడు పనులన్నింటికీ ఏదైనా శిక్ష వేసి మాన్పించమని అమ్మను కోరాడు. మంచి అలవాట్లు ఏమీ లేవా ? అని అడిగింది అమ్మ. అతడు ఆలోచించి ఒక్కటుందమ్మా ! ఎవరు తినలేదన్నా సహించలేను. నేను మానుకొని అయినా వాళ్లకు పెడతానన్నాడు. 'అంతేనా' అని అమ్మ ప్రశ్నించింది. కొంచెం సేపు ఆలోచించి అబద్ధమాడనమ్మా ! అన్నాడు. 'ఇవి కూడా నీ దృష్టిలో చెడు అలవాట్లేనా' అని నవ్వుతూ అడిగి మళ్ళీ అమ్మే ఈ విధంగా అన్నది. 'మనుష్యులందరూ మంచివాళ్ళే నాన్నా ! చెడ్డవాడు ఎవరయినా ఉంటే మనం అనుకునే ఈ చెడ్డతనాన్ని మనకు ఇచ్చిన భగవంతుడు మాత్రమే. అదయినా ఎవరి పనుల కెవరు మాత్రం బాధ్యులు. అందరూ ఇంకెవరో ఒకరు నడిపితే నడిచే వాళ్లే గదా ! అని అతడిని ఓదార్చింది. ఆ తరువాత అతడు 1942 లో జిల్లెళ్ళమూడిలో అమ్మ ఇంట పాలేరుగా చేరాడు. అమ్మ దగ్గరకు వచ్చాక అతని జీవన విధానమే మారిపోయింది. అంతకు పూర్వం అతను తెలిసినవారు ఆ మార్పును చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ తరువాత చాలాకాలం అమ్మ సేవ చేసుకొని 1950లో స్వర్గస్థుడైనాడు. సామాజికపరంగా చూసినా సంస్కార పరంగా చూసినా కొందరి దృష్టిలో అంటరాని వాడిగా భావించబడే అతడు అమ్మ ప్రేమ, ఆదరణతో సంస్కారవంతుడై పలువురి ప్రశంసలందు కున్నాడు.

అమ్మకు స్వర్ణోత్సవ సందర్భంగా బిడ్డలందరూ కలిసి 'జన్మదిన కానుక ఏం కావాలమ్మా ! అని అమ్మను అడిగితే లక్షమంది ఒకే పంక్తిలో భోజనం చేయాలనీ, ఆ మనోహర దృశ్యం తాను చూడాలనీ తన కోరికను వ్యక్తం చేసింది. ఆ కోరికలో ఎంత మధురమయిన మమత. ఆ మమతానుబంధమే అమ్మ ప్రత్యేకత. లక్షమందిలో ఏ ఒక్కరు భోజనం చేయకపోయినా నాకు బాధగానే ఉంటుంది నాన్నా ! అని పలికే ప్రేమామృతవర్షిణి అమ్మ. అసాధారణమైన ఈ వాత్సల్యం వల్లనే ఎందరో అమ్మ పట్ల ఆకర్షితులయ్యారు.

తన వద్దకు వచ్చే అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో అమ్మ తన ఇంటికి పెట్టిన పేరు అందరిల్లు. ఈనాడు కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, వర్ణాలుగా విడిపోతున్న సమాజాన్ని వాత్సల్యబంధంతో ముడివేసి వర్గం లేని స్వర్గంగా రూపొందించాలని అమ్మ కోరిక. దానికి ఆచరణ రూపమే అందరిల్లు. అక్కడ వర్గ వర్ణ వయోభేదం లేకుండా అందరూ సభ్యులే. ఆ అందరింటిలో ప్రధానభాగమే అన్నపూర్ణాలయం. ఇది అమ్మ వాత్సల్యానికి ప్రతిరూపం. ఏవేళ ఎందరు వచ్చినా ఆదరంగా అన్నం పెట్టాలన్నది అమ్మ ఆకాంక్ష. భావాలు కలిసిన పదిమంది నిస్వార్థంగా సమిష్టి ప్రయోజనం ఆశించి ఏ పనిచేసినా అది యజ్ఞం. అందుకే అమ్మ నిరంతరంగా సాగే ఈ అన్నదాన కార్యక్రమానికి **మాతృయాగం** అని పేరు పెట్టింది. అమ్మను చూడడానికి వచ్చిన వారు 'అమ్మా ! మీరు ఇంతమందికి అన్నదానం ఎలా చేస్తున్నారు అంటే 'తల్లి బిడ్డలకు అన్నం పెట్టుకోవడంలో విశేషమేముంటుంది నాన్నా ! అయినా నేను పెట్టడం ఏముంది ? వాళ్ల అన్నం ఇక్కడ ఉండి తింటున్నారు అది లేకపోతే వాళ్లు రాలేరు. వచ్చినా తినలేరు' అని సమాధానం చెప్పేది. అమ్మను మనం చూసినా మనని అమ్మ చూసినా వేసే మొదటి ప్రశ్న 'భోం చేశావా నాన్నా' ! అని. అన్న పూర్ణాలయంలో డ్రస్ అడ్రస్ కాదు ఆకలే అర్హతగా భోజనం పెట్టమన్న అమ్మ ఆదేశంలో. 'ఈ ప్రపంచంలో ఎవరూ ఆకలితో బాధపడకుండా ఉండేరోజు రావాలి' అనే అమ్మ కోరికలో అమ్మ ప్రేమతత్త్వమే ప్రకటిత మవుతుంది. ఆ ప్రేమతత్త్వానికి అమ్మ జీవితంలో ప్రతిక్షణమూ దృష్టాంతమే. ప్రతి సంఘటనా నిదర్శనమే.

'సౌరభము లేల వెదజల్లు పుష్ప వ్రజము
చంద్రికలనేల వెదజల్లు చందమామ
ఏల సలిలంబు పారు – గాడ్పేల విసరు'

పూలకు పరిమళాలు వెదజల్లడం, గాలి వీచడం, నీటికి ప్రవహించడం ఎంత సహజమో అమ్మకు ప్రేమ అంత సహజమైంది. అందరినీ కారణం లేకుండా ప్రేమించటమే ప్రేమ యొక్క యదార్థస్థితి కదా !

నీ బిడ్డ యందు దేనిని చూస్తున్నావో అందరి యందు దానిని చూడడమే బ్రహ్మ స్థితిని పొందడం' అన్నది అమ్మ ఉపదేశం. లోకాన్ని తనవలె ప్రేమించడం ఒక మార్గం అయితే లోకాన్ని బిడ్డగా ప్రేమించడం మరొక మార్గం. అమ్మకు ఎపుడు ఎవరిని చూసినా తన బిడ్డయే అన్పిస్తుందట. మనుష్యులే కాదు ఈగలు, దోమలు, పశువులు, పక్షులూ, రోగాలూ, బాధలూ కూడా బిడ్డలుగానే ప్రేమింపబడటం అమ్మ జీవితంలో అడుగడుగునా కన్పిస్తుంది. పూజించినా, ద్వేషించినా అందరినీ సమానంగా ఆదరించి ప్రేమించడం అమ్మకు సహజం. కనుకనే చిన్నతనంలోనే వాసుదేవస్వామి గారిని 'నా మీద ఎవరికి ప్రేమ ఉన్నా లేకపోయినా నాకందరి మీద ప్రేమ ఉండేటట్లు ఆశీర్వదించండి' అని అడిగి తన అరవయ్యేళ్ళ జీవితంలోనూ సృష్టిలోని ప్రతి ప్రాణినీ ప్రేమించి వారి యందు ప్రేమామృతాన్ని వర్షించి ఆచరణ ద్వారా ప్రేమించటమంటే ఏమిటో నేర్పింది.

పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా అమ్మ బాల్యం నుంచీ తన ప్రేమ పరిమళాలను లోకానికి వెదజల్లింది. అమ్మకు నాలుగేండ్ల వయస్సులో ఒకసారి సముద్ర తీరానికి వెళ్లగా అక్కడ ఒక జాలరి అమ్మ ఒంటినిండా ఉన్న సొమ్ములు చూసి మనస్సులో ప్రలోభం కలిగి లాలనగా అమ్మను ఎత్తుకొని బుజ్జగిస్తూ జామపందు తినిపిస్తూ సొమ్ములన్నీ ఒలుచుకున్నాడు. ఈ పిల్ల ఎవరితోనయినా చెబితే తాను దొరికితే ఈ సొమ్ముతో పాటు తన ప్రాణం కూడా దక్కదని భయపడి ఈ పిల్లను నామరూపాలు లేకుండా చేయాలనే క్రూరమైన ఆలోచనతో రెండు చేతులతో ఎత్తి సముద్రంలో విసరివేశాడు. కాని ఆ క్షణంలో తనకు కల్గిన వింత అనుభవంతో తన తప్పు తెలిసికొని పశ్చాత్తాపంతో దహించుకుపోతూ విలపిస్తూ నగలను తిరిగి ఇవ్వబోయాడు. అమ్మ అతణ్ణి బుజ్జగిస్తూ 'ఈ సొమ్ము నీవే ఉంచుకో నాన్నా! నీవు ప్రాణాలతో దక్కావు నాకు అదే చాలు. 'తల్లికి బిడ్డ సొమ్ము, బిడ్డకు డబ్బు సొమ్ము' అని అవ్యాజమైన ప్రేమను ప్రకటించింది. ఈ విధంగా కరుడుగట్టిన అతని క్రౌర్యాన్ని తన ప్రేమతో కడిగివేసింది. ఎంతటి కఠిన పాషాణమయినా ఆ అనురాగస్పర్శతో సచేతనమై ద్రవించవలసినదే. తనను చంపటానికి వచ్చిన క్రూరుని సైతం బిడ్డగా చూసే ఆ మనస్తత్వం నాలుగేళ్ల వయస్సులో ఉన్న అమ్మకు ఏ సాధన ఫలితమని చెప్పగలం ?

"కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతో నభవతి" అని శ్రీ శంకరాచార్యులు వచించినట్లుగా 'రావణాసురుడు దుర్మార్గుడే అయినా అతని తల్లి అతనిని ప్రేమించ కుండా ఉంటుందా అని ప్రశ్నిస్తుంది అమ్మ. మంచి వాళ్లను వాళ్ల మంచితనమే

కాపాడుతుంది. లోకం ఎలాగో వాళ్లని గౌరవిస్తుంది. పెద్దవాళ్లను నేను కూడ దగ్గరకు తీయకపోతే ఎలా ? అని ప్రశ్నించే కరుణారససాగరము అమ్మ.

చిదంబరరావు తాతగారి అమ్మాయి భారతికి ఏదో గాలి పట్టిందనీ, ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేస్తే తగ్గుతుందని ఎవరో సలహా ఇచ్చారు. ఇంకొల్లు, పావులూరుల మధ్య ఆంజనేయస్వామి ఆలయం ఉన్నది. అక్కడ ఆంజనేయస్వామి స్వయంగా వెలిశాడని ఆ ఆలయానికి ఎంతో ప్రసిద్ధి ఉన్నది' అందుకని చిదంబరరావు గారు, ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు, అమ్మ, భారతి అత్తయ్యతో బాటు అందరూ వెళ్ళి అక్కడ సత్రంలో ఉంటూ ఆమెచే ప్రదక్షిణలు ప్రారంభం చేయించారు. మిరియాలతో రెండు పూటలూ 108 ప్రదక్షిణాలు చేసి పూటకు బిందెడు పానకం, 3 సోలల వడపప్పు చేసి రెండుపూటలా సమహస్రానామార్చన చేయించుకుంటూ ఇద్దరు బ్రాహ్మణులకు భోజనం పెడుతూ ఉన్నారు. ఆమె రోజూ నివేదన పెట్టిన తరువాత అమ్మ ఆ వడపప్పును తీసికొని ఇతరులు ప్రసాదంగా పెట్టినవి కూడ దాచుకొని అన్నీ కలిపి వంట బ్రాహ్మణుడయిన రాఘవయ్య గారి నడిగి చింతపండు, పచ్చిమిరపకాయలు ఉప్పు తీసికొని పచ్చడిరుబ్బి చెరువు కట్ట మీద కూర్చునే బాటసారులకు, పావులూరు నుండి బట్టలు ఉతకటానికి వచ్చే రజకులకు, అక్కడ పనిచేసే వాళ్లకూ అక్కడ ఉండి ప్రదక్షిణలు చేసే పేదవాళ్లకు ఇలా ఎందరికో పెడుతూ ఉండేవారు. అమ్మ ఆలోచనా దృక్పథమే విలక్షణమయింది. అన్నం ఉన్నా అందులోకి సరైన అనుపాకం లేక ఎంతోమంది కడుపునిండా భోజనం చేయరు. మరి అమ్మ వాళ్ల స్థితి గమనించిందేమో తానే స్వయంగా పచ్చడి రుబ్బి వాళ్లకు పెట్టింది.

ఒకసారి అమ్మ, లోకనాథం బాబాయి చెరువు కట్టమీదకు ఆడుకోవటానికి వెళ్ళారు. ఆ చెరువులో పూలు ఉన్నాయి. 'ఎవరికయినా ఈ లడ్డు పెట్టి వాళ్లచేత ఈ పూలు కోయించుకుందామని అన్నది అమ్మ. 'లడ్డు ఇవ్వటం ఎందుకు ? ఒక అణా యిచ్చి కోయించుకుందాం' అని లోకనాథం బాబాయి అన్నాడు. మనం ఇచ్చే అణాకి లడ్డు ఇవ్వరుగా, ఇవి మంచి లడ్లు బాగున్నాయి వాళ్ళు ఎపుడూ తిని ఉండరు. కావాలంటే మనకు ఇంటి దగ్గర ఇస్తారు కదా ! అన్నది అమ్మ. ఇటువంటి ఆలోచన ఆ వయస్సులో ఎవరికి కల్గుతుంది ?

ఒకసారి అమ్మ చీరాలలో వాళ్ల పినతల్లి గారింటికి వెళ్ళింది. తల్లిలేని పిల్ల అని అందరూ అమ్మను వాళ్లవద్ద కొన్నాళ్లు ఉండడానికి తీసుకు వెళుతుండేవారు. ఒక రోజు అమ్మ పినతల్లి శేషమ్మగారు ఎంతో ప్రేమతో అమ్మకు పూరీలు చేసి పెడితే 'నాకు పెట్టేబదులు ఆ విస్తళ్లలో ఏరుకుతింటారే వాళ్లకు పెట్టరాదూ ? వాళ్లు తింటే

నేను తిన్నట్లేనని యానాదులకు పెట్టి వాళ్ల కళ్లలో తృప్తినీ, ఆనందాన్నీ చూసి మురిసి పోయింది అమ్మ. ఎపుడూ ఇతరులు తినాలని కోరుకోవడం, వారు తింటే చూసి ఆనందపడే అసాధారణ వ్యక్తిత్వం అమ్మ ప్రత్యేకత. కలకండ ప్రతి అణువూ మాధుర్య భరితమైనట్లుగా అమ్మ ప్రేమతత్వానికి అమ్మ జీవితంలో ప్రతి సంఘటనా నిదర్శనమే. ప్రతిక్షణమూ దృష్టాంతమే.

'మీరు నా బిడ్డలే కాదు. నా అవయవాలు కూడ' అని ప్రకటించిన అమ్మ వారు వీరు అనే బేధం లేకుండా దొంగతనానికి వచ్చిన వారిని కూడా ఆదరించి అన్నం పెట్టిన సంఘటనలనేకం ఉన్నాయి.

ఒకసారి నక్సలైట్లు అని చెప్పుకుంటూ కొందరు అందిరింటిపై దాడిచేసి నగలు దోచుకుని భీభత్సాన్ని సృష్టించి వెళ్లారు. తరువాత పోలీసులు వాళ్లను బంధించి తెచ్చిన సందర్భంలో అమ్మ 'ముందు వాళ్ల భోజనం సంగతి చూడండి. ఆలస్యముంటే టిఫిన్ పెట్టించండి అని ఆదేశించింది. ఆ మాటలు విన్నవాళ్లందరూ విస్తుపోయారు. అమ్మ 'బిడ్డలందరూ ఒకే విధంగా ఉండరు. కొందరు అడిగి తీసుకుంటారు కొందరు అదరగండంగా తీసుకుంటారు. వీళ్లు ఆ కోవకు చెందినవాళ్లు అని చెప్పింది. ఆ సన్నివేశంలో అమ్మను ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అందరి మనస్సలలో అనేక ప్రశ్నలు తల ఎత్తుతుంటే 'తల్లికి తప్పే కన్పించదు అన్న అమ్మ వాక్యం సమాధానమై నిలిచింది.

ఈ సందర్భం రామాయణంలో సీతాదేవి హనుమంతునితో అన్నమాటలను స్ఫురింప చేస్తుంది. రావణ సంహార వార్త అశోకవనంలో ఉన్న సీతాదేవికి చెప్పిన హనుమంతుడు 'ఇన్నాళ్లు నిన్ను బాధపెట్టిన ఈ రాక్షస స్త్రీలందరిని చంపుతాను. అనుమతినివ్వమని అడుగగా సీతాదేవి హనుమంతుని వారిస్తూ

'పాపానాం వా శుభానాం వా వధార్హాణాంప్లవంగవ

కార్యం కరుణ మార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి' అని అంటుంది. 'పాపాత్ము లయినా, పుణ్యాత్ములయినా అందరి విషయంలోనూ కారుణ్యాన్ని చూపాలి. నీ ప్రభువు ఆజ్ఞ నీవెట్లా పాటించావో వారు ఇంతవరకు రావణుని ఆజ్ఞను అనుసరించారు. అయినా లోకంలో అపరాధం చెయ్యని వాళ్లు ఎవరుంటారు ? కనుక వీళ్లు వధార్హులు కారు అని నివారించింది.

ప్రేమకు పరాకాష్ఠస్థితి సేవ. ప్రేమ లేకుండా సేవ రాణించదు. సేవగా అభివ్యక్తం కాని ప్రేమ శోభించదు. ఈ జగన్నాధరధానికి ఇరుసు ప్రేమ అయితే చేరుకోవలసిని గమ్యం సేవ. సేవద్వారా ప్రేమ అనుభూతిలోకి వస్తుంది. బిడ్డ బురద

పూసుకు వచ్చినా అసహ్యించుకోకుండా కడిగి వేసేది తల్లిమాత్రమే. ఏ తల్లి ప్రేమ అయినా ఆ బిడ్డకే పరిమితం. కాని అమ్మ వా రెవరయినా, ఎలాంటి వారయినా రోగాల బారిన పడ్డప్పుడు వారికి కన్న బిడ్డలుగానే సేవచేసింది. తనకు అనారోగ్యంగా ఉండి చీరాలలో హాస్పిటల్‌లో ఉన్నప్పుడు కూడ తన ఆరోగ్యం లెక్క చేయక అక్కడున్న రోగులందరికీ సేవచేసింది. జీతగాడయిన మంత్రాయి క్షయవ్యాధి బారిన పడ్డప్పుడు బాపట్ల హాస్పిటల్లో కుష్ఠురోగులను సందర్శించినపుడు సామాన్యులు అసహ్యించుకునే వాటిని సైతం లెక్కచేయక ఎందరికో మాతృమూర్తియై సకలోపచారాలు చేసింది.

నాన్నగారికి అవసరమయిన పరిచర్యలన్నీ చేయటమే కాదు బామ్మగారు చరమాంకంలో క్యాన్సర్‌తో బాధపడుతుంటే అక్కడనే ఉండి అహర్నిశలు సేవచేసింది. 'నేను సామాన్యగృహిణిని' అని చెప్పుకునే అమ్మ తన కుటుంబ సభ్యులకు సేవచేయటంలో విశేషం లేకపోవచ్చునేమో కాని తనను దర్శించటానికి వచ్చిన వారందరికీ అవసరమయిన సపర్యలు చేసింది. ఒకసారి అందరింటి ఆవరణలో అందరూ ఫ్లూజ్వరంతో బాధపడుతుంటే ప్రతివారి దగ్గరకు వెళ్లి జావ, మందులు స్వయంగా అందించింది. ఇక్కడ చదువుకునే విద్యార్థినీ విద్యార్థులు అనారోగ్యంతో ఉంటే తాను క్రిందకు రాలేని స్థితిలో కూడా వారందరికీ అన్నపూర్ణాలయంలో గుండిగలతో జావకాయించి మా అందరిచేత విద్యార్థుల గదులకు పంపి వారికి తగ్గే వరకు ఎంతో తపన పడేది. అసాధారణమైన అమ్మ స్థితికి ఇలాంటివి అత్యల్పమైనవిగా తోచవచ్చు. కానీ చిన్నతనం నుంచీ అమ్మలో ఈ లక్షణం ఉన్నది అనటానికి అనేక సంఘటనలున్నాయి.

ఒకసారి అమ్మ మరిడమ్మ తాతమ్మతో కలిసి గుంటూరులో బంధువుల ఇంటికి వెళ్లింది. అది చింతపల్లి రామచంద్రరావు గారిల్లు. ఆ ఇంట్లో రామచంద్రరావుగారి తమ్ముడయిన గుండేలురావు అనే ఆయన పక్షవాక్షంతో 20 సంవత్సరాలు నుండి బాధపడుతూ ఉంటారు. ఆయనకు భార్యా పిల్లలు లేరు. వారి అన్నగారి కుటుంబమే ఆయనకు ఆశ్రయం. అన్నగారికి రెండో వివాహం కావటం వలన రామచంద్రరావు గారిని చూడడమే అంతంత మాత్రంగా వుంది. అమ్మ వాకిట్లో బండిదిగి వెళ్లటమే సరాసరి గుండేలురావుగారి మంచం దగ్గరకు వెళ్లి దుర్వాసన, దుర్భరంగా ఉన్న వస్త్రాలు మార్చి అన్నం కలిపి నోట్లో పెట్టడం ఇంకా అవసరమయిన సేవలన్నీ చేసింది. ఆయాచితంగానూ అత్యంత అనురాగంతోనూ అమ్మ చేసే ఉపచారానికి గుండేలురావు గారు పులకించిపోయారు. అప్పటికి అమ్మకు 7 సంవత్సరాలు. ఆయన రామభక్తుడు కావటంతో తన ఇష్టదైవమే తనను అనుగ్రహించే నిమిత్తం ఇలా ప్రత్యక్షమయినాడని భావించారు.

అమ్మకు పదిహేనేళ్ల వయస్సులో క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో మంచినీళ్ల కోసం బిందె తీసుకుని రైల్వేస్టేషన్ దగ్గర ఆస్పత్రి సమీపంలో ఉన్న కుళాయి దగ్గరకు రోజూ వస్తూ ఉండేవారు. ఆసుపత్రి గోడ ప్రక్కన మూడు రోజులుగా ముసుగు కప్పుకుని ఒక మనిషి పడుకుని ఉన్నాడు. ఎవరూ ఆ సంగతి పట్టించుకో లేదు. కాని అమ్మ దగ్గరకు వెళ్లి అతనిలో ఏమైనా కదలిక వస్తుందేమోనని చూస్తుండగా ఆ దారిన ఎవరో ఒక మనిషిపోతూ 'నీ కెందుకు చిన్నపిల్లవు. ఆ అబ్బాయి నాలుగు రోజుల నుండి ఉన్నాడు. చచ్చిపోయినట్లున్నాడు. పెద్ద పెద్దవాళ్ళంతా ఊరుకుంటే నీ కెందుకు అని మందలించి వెళ్ళాడు. కాని అమ్మ ఆ మాట లేమీ పట్టించుకోక మెల్లగా ఆతని ముసుగు తీస్తుంది. జ్వరం మండిపోతూ అతనికి కళ్లు అంటుకొని పోయి పుసులు కట్టి నీళ్లు కారుతూ ఉంటాయి. ఆ స్థితి చూసి అమ్మ తానే స్వయంగా డాక్టరుని పిలుచుకు వచ్చి అతనిని ఆస్పత్రిలో చేర్పించి తన చీరె పమిటచెంగు చించి దుర్వాసనతో నున్న అతని శరీరాన్ని తడిగుడ్డతో తుడిచి లేవదీసి కూర్చోబెట్టి తను ఆసరాగా నిలబడి తన వేళ్లతో పళ్లుతోమి, ముఖం కడుగుతుంది. అది చూసి డాక్టరు గారు 'అబ్బా చేతితో పట్టుకోబోకమ్మా మన నోట్లో నీళ్ళే మన చేతిలో పోసుకోకూడదు అని ఎంత వద్దని వారిస్తున్నా అమ్మ ఏ మాత్రం అరమరికలు లేని ఆదరణలో కంపుగొడుతున్న అతనికి అన్ని పరిచర్యలు చేసింది. సమాజపరంగా గానీ, కుటుంబపరంగా గానీ ఎన్నో ఆంక్షలు ఉన్న ఆ రోజుల్లోనే కులమతాలు పాటించకపోవటమేకాదు వయోభేదం, లింగభేదం లేకుండా పరిచర్యలన్నీ చేసింది. అతనిమీద మమకారాన్ని చంపుకోలేక మంచినీళ్లకు వచ్చే వ్యాజంతో ఇంట్లో వాళ్లకి తెలియకుండా పథ్యం తెచ్చి, ఆ అన్నం కలిపి నోట్లో పెట్టింది. అతని కంటివెంట అప్రయత్నంగా నీరు కారటం చూసి అమ్మ ఎడం చేత్తో అతని తల భుజం మీద ఆనించుకుని ఎందుకు నాన్నా ! గొంతు నొప్పిగా ఉందా అంటుంది. ఇంకా పెద్దగా ఏడుస్తాడు అతడు. అది చూచి డాక్టరు గారు మీ తల్లీ కొడుకులను చూస్తుంటే నాకు వస్తున్నాయి కన్నీళ్లు అని కళ్లు తుడుచుకుంటారు. ఆ తరువాత అతని వివరాలు అడిగితే తెలుగురాదేమో, హిందీలో మేరా నామ్ రహి అంటారు. అతడు ముస్లిం. ఇంగ్లీషు ఏమయినా వచ్చేమోనని డాక్టరుగారు మీ ఊరు ఏది అని అడుగుతారు ఇంగ్లీషులో. మెదక్ జిల్లా అంటాడు. అమ్మను చూపి ఈమె ఎవరు అంటారు. మా అమ్మ అంటాడు రహి. అపుడు డాక్టరు గారు అమ్మతో ఇతనితో నీకు పూర్వ పరిచయమున్నదా అమ్మా! అని అడిగారు. మీ కంటె మూడురోజుల ముందు ముసుగు కప్పుకుని ఉన్న రూపాన్ని చూశాను. మీకంటె ఒక అరగంట ముందు ముసుగు తీసి చూశాను అని చెప్పింది అమ్మ. నాకు నమ్మకం

లేదు బ్రతుకుతాడని పొగానే వెంటనే చెట్టు క్రింద పడవేస్తాను. మనిషి దగ్గరకు పోవటానికి కూడ వీలులేకుండా వాసనవేస్తున్నాడు అన్నాడు డాక్టరు గారు.

డాక్టరుకే బ్రతుకుతాడని నమ్మకం లేని ఆ వ్యక్తి అమ్మ ఆదరణతో కోలుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. డాక్టరు గారు అమ్మతో ఒక అనాధకు, దిక్కులేనివాడికి, దిక్కు నీవై తల్లికంటె ఎక్కువగా సేవచేశావు. ఇదంతా నాకు పాఠంగా ఉన్నదమ్మా అన్నారు. ఆ తరువాత ఆ రహి జీవితం అమ్మ సేవకే అంకితం అయింది.

ఈ విధంగా ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన బాల్యంలోనే ఎంతో మందికి అవ్యాజానురాగంతో సేవచేయటం అమ్మలో కన్పిస్తుంది. జ్ఞానానికి మరో రూపం ప్రేమ, ప్రేమకు అభివ్యక్తి మార్గం సేవ, సాటిమనిషి పట్ల మనిషిగా కారుణ్యంతో స్పందిస్తే అదే ప్రేమ. ప్రేమలో అంతర్వాహినిగా కరుణ ఉంటుంది. కరుణలో అంతర్వాహినిగా ప్రేమ ఉంటుంది. కారుణ్యానికి ప్రతీక బుద్ధుడు అయితే వాత్సల్యానికి పతాక అమ్మ. ఆనాటి పరిస్థితిని బట్టి సమిష్టి కోసం వ్యష్టి జీవితం అర్పణ చేయాలన్నదే బుద్ధుడి దృక్పథం.

వ్యక్తిగా జీవితం కొనసాగిస్తూనే తన విశ్వజననీ మాతృత్వంతో అవ్యాజ వాత్సల్యంతో సమాజంలో మార్పు తీసుకురావలన్నది అమ్మ దృక్పథం. అమ్మను దర్శించిన చాలామంది అమ్మలో కారుణ్యమూర్తి అయిన బుద్ధుడ్ని సందర్శించామని చెప్తూ ఉంటారు. ఆ విషయాన్నే డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు 'బుద్ధుడు - క్రీస్తు - అమ్మ' అనే వ్యాసంలో 'బుద్ధుడి జీవిత చరిత్ర చదువుతున్నప్పుడు ప్రతి ఘట్టంలో కరుణ రసం కన్పించింది. 'ఆయన ఎంతటి శాంతమూర్తిగా కనిపించేవారో! ఎలా ఊహించడం. గతాన్ని తెలుసుకోగలమేమో కాని దాన్ని చూడలేము. అందుకని ఇరవైఅయిదు శతాబ్దాల దూరం కాలవాహినలో సాగిపోయిన బుద్ధుని పవిత్ర మూర్తిని హృదయంలో చిత్రించుకోవడానికి ప్రయత్నించాను. అయితే అది అంత సులభంగా తోచలేదు కాని అమ్మ దగ్గరకు వచ్చాక అమ్మలో బుద్ధుడిని దర్శించగలిగాను. 'అమ్మ కరుణామయిగా, ప్రేమమూర్తిగా, సహనరూపిణిగా నాకు కనిపించింది' అని తెలియ చేశారు. మానసిక సంస్కారంతో పవిత్రమైన భావాలతో, సమత్వభావంతో, ప్రేమతో ఉపకారబుద్ధితో ఉండాలని బుద్ధుని ప్రబోధం. అవే జ్ఞానప్రాప్తికి హేతువులని ఆయన ఉపదేశం. అతని ధర్మానికి మానవుడే కేంద్రం.

కళ్లు మూసుకుని తపస్సు చేయడం కన్నా కళ్లు తెరిచి చుట్టూ ఉన్నవారి బాధలను దుఃఖాలను దూరం చేయాలన్నదే బుద్ధుని మానవతావాదం. కష్టాల్లో ఉన్నవారికి ఇతరుల సహాయసహకారాలు అవసరం ఉంటాయి. ఆపదల్లో ఉన్నవారిని

ఆదుకోవడం మానవధర్మం. లోకంలో కాళ్లు, కళ్లులేని వాళ్లు, దిక్కులేని వాళ్ల రోగులు ఎందరో ఉన్నారు. అటువంటి వారిని ఆదుకోవడమే మానవత్వమున్నవారి ప్రధమ కర్తవ్యం అని చెప్పడమే కాక ఆయన ఎంతో మంది అనాధలైన వారికి సేవ చేసి ఆచరణాత్మకమైన ప్రబోధాన్ని అందించారు. గాంధారదేశంలో ఒక వృద్ధతాపసి ఉండేవాడు. అతనికి దుష్టమైన రోగం సోకింది. శరీరం చూడటానికి చాల అసహ్యంగా ఉండడం వలన ఎవరూ అతని వద్దకు పోయి ఆహారపానీయాలు ఇచ్చేవారు కాదు బుద్ధునికి ఈ వార్త తెలిసింది. మహాత్ముల హృదయాలు బహు సున్నితాలు కదా ! అతని వద్దకు వెళ్లి స్నానం చేయించి బట్టలు ఉతికి సమస్త ఉపచారాలు చేశాడు.

ఒకసారి విజయనగరం రోటరీ క్లబ్బువారు అమ్మ దగ్గరకు వచ్చినపుడు మాకేదయినా సెలవివ్వమ్మా అని కొందరూ, ఏం చేయమంటారు అని మరికొందరూ అడిగారు. వాళ్లకు సమాధానంగా అమ్మ 'చేయవలసింది చాలా ఉన్నది నాన్నా ! అనాధలు అనేకులు ఉన్నారు. వికలాంగులయిన వాళ్లూ, ఆధారమేమీ లేని వాళ్లు, లోకంలో ఎందరో ఉన్నారు. వారందరినీ ప్రేమగా చూడండి. లోకంలో ఎవరూ తాము అనాధలమనీ, ఆధారంలేని వాళ్లమనీ అనుకోకూడదు. తమ కాళ్లమీద తాము నిలబడలేని వారికే గదా కఱ్ఱ ఆసరా. వారికి తోడుపడండి. అయితే అది వారిపై జాలితో చేసే సహాయమని అనుకోక వారిని భగవత్స్వరూపులుగా భావించి వారికి సేవచేయండి. కనిపించని దేవునిపై మనసు నిలపడం లేదనీ, ఏకాగ్రత కుదరడం లేదనీ బాధపడక కనిపించే ఈ దేవుళ్లను (మానవులను) ప్రేమతో ఆరాధించండి. ఆ సేవ కలిగే తృప్తే ముక్తి' అని వివరించింది.

సత్యసాయిబాబా Survice to Humanity is service to Devinity' అని ప్రబోధించారు. ఈ విధంగా మహాత్ములందరూ జాతి కులమత భేదాలకు అతీతంగా సామాజికసేవను ఆచరణాత్మకంగా ప్రబోధించారు.

ఈ జగన్నాధరధానికి ఇరుసు ప్రేమ అయితే ఆ రధాన్ని ముందుకు నడిపే ఇంధనమే త్యాగం. త్యాగభావంతో ప్రేమను పంచాలి. చిన్నతనం నుంచీ ఎదుటివాళ్ల కష్టాలను, కన్నీళ్లనూ గమనించి తన దగ్గర ఉన్న డబ్బును ఇచ్చి ఆదుకోవడం అమ్మకు అలవాటు ఎవరు ఏ అవసరంతో ఉన్నా ఆదుకోవడం అమ్మ నైజం. ఇంట్లో ఏమయినా వస్తువులు తీసుకురమ్మని డబ్బు ఇస్తే దారిలో కుంటివాళ్లూ, గుడ్డివాళ్లూ కనిపిస్తే ఇచ్చి వేసేది. దగ్గర ఉన్న డబ్బేకాదు. ఒంటిమీదున్న నగలను చివరకు తాను వేసుకున్న గౌను కూడ ఇచ్చి వేసిన సంఘటనలు అనేకం కన్పిస్తాయి. ఇది అమ్మకు సర్వసాధరాణ మయిన విషయం. చిదంబరరావు తాతగారిని అడిగి ధోవతులు తీసుకుని తన,

బట్టలు అన్ని కలిపి బిచ్చగాళ్ళకు ఇస్తూ ఉండేది. ఒకసారి ఒక క్షయరోగికి వైద్యం నిమిత్తం అమ్మ తన నగలు తీసి ఇవ్వటం చూసిన రామాచార్యుల గారు చిదంబర రావు తాతగారితో 'అమ్మాయికి చిన్నతనం కదూ పాత్రత ఎరిగి దానం చేయటం తెలీదు అన్నారు. వెంటనే అమ్మ 'నేను ఎవరికి ఏమి ఇచ్చినా అది దానం అనుకోవడం లేదు. వారి వస్తువే నా దగ్గర ఉన్నది వారిది వారికి ఇస్తున్నానని అనుకుంటున్నాను. వారిది వారికి ఇవ్వడంలో వారి మంచి చెడ్డల ప్రశ్నతో సంబంధం ఏముంది ? ఒక వేళ నేనే ఇస్తున్నాని మీరు అనుకుంటే నాకు వారి అవసరమే కన్పిస్తుంది కాని వారి అర్హత ప్రసక్తి రాదు' అని సమాధానం ఇచ్చింది. అమ్మకు నాలుగేండ్ల వయస్సులోనే ఒకసారి బాపట్లలో బజారులో వెళ్తుండగా బ్రహ్మాండం వారి సత్రంలో బిచ్చగాళ్లూ, ఇంకా అనేకమంది కలిసి భోజనం చేయడం చూసిన అమ్మ మనసులో ఆ క్షణంలోనే ఒక ఆలోచన కలిగింది. అన్ని గ్రామాల్లో అందరి ఆస్తులూ కలుపుకుని ఎవరి వృత్తి వారు చేసుకుంటూ ఒకే చోట ఉంటూ ఒకే రకంగా తింటూ ఉంటే ఎంత బాగుంటుంది అని. అమ్మ ఆ తరువాత ఏర్పరచిన అందరింటికి, అన్నపూర్ణాలయానికి దివ్యసంకల్పం ఆనాడే జరిగిందేమో...

బాల్యం నుంచీ అమ్మ ఆలోచన విలక్షణంగా సాగేది. ఒకసారి బాపట్ల రైల్వే ప్లాట్ ఫారం మీద చిదంబరరావుగారు అమ్మకు జీడిపప్పు కొని పెట్టారు. వెంటనే అమ్మ ఆ జీడిపప్పు అమ్మే పిల్లకు కూడ ఒక కానీ జీడిపప్పు కొనిపెట్టింది. అదేమిటి? ఆ పిల్లకు అన్ని జీడిపప్పులున్నాయి గదా అని చిదంబరరావుగారు అడిగితే 'ఆ అమ్మాయికి అమ్ముకోవటానికే గాని తినటానికి కాదుగా అవి. అమ్మే వాళ్లు అసలు తినలేరు అన్న అమ్మ సమాధానమే అమ్మ విలక్షణమైన ఆలోచనను తెలియచేస్తుంది.

అమ్మలో ఎపుడూ అందరికీ ఏదో పెట్టుకోవాలనే తపన కనిపించడం అందరికీ అనుభవంలో ఉన్న విషయమే. నీకు కూడా ఆశ, అసంతృప్తులు ఉంటాయా అని అడిగితే మీకు పెట్టుకోవాలనే ఆశ. ఇంకా బాగా పెట్టుకోలేకపోతున్నాననే అసంతృప్తి ఎపుడూ ఉంటాయి నాన్నా! అని చెప్పింది. ఇక్కడ కళాశాలలో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు అన్నపూర్ణాలయంలో మూడు పూటలా భోజనం ఏర్పాటు చేయడమే కాక వాళ్లకు ఇంకా మంచి భోజనం పెట్టాలి నాన్నా ! గడ్డ పెరుగు వేసి వాళ్లు అది కలుపుతుంటుంటే ఆ వేళ్ల మధ్యలోంచి వచ్చిన పెరుగును వారు తింటూ ఉంటే చూడాలని ఉంది అని ఎపుడూ అంటూ ఉండేది. సాయంకాలం పూట వాళ్లు కాలేజీ నుంచి వచ్చేటప్పటికి ఏదో ఒకటి పెట్టాలనీ, కడుపునిండా తినకపోయినా కనీసం వాళ్లకు మంచినీళ్లు తాగాలని అన్పించటం కోసమైనా ఏదో ఒకటి తినాలనీ,

అందుకోసం సాయంకాలం గుగ్గిళ్లు, మొక్కజొన్నలు, మొదలయిన పదార్థాలను ఏర్పాటు చేయించేది. అవి గుప్పెడు తిని కాసిన్ని మంచినీళ్లు తాగితే వాళ్ల కడుపునిండుతుంది గదా ! అని అమ్మ ఆలోచన. ఇలాంటి ఏర్పాటు జరుగుతున్న రోజులలో ఒకసారి కళాశాల విడచి పెట్టాక నేను అమ్మ దగ్గరకు వెళ్లి కూర్చున్నాను. అమ్మ వెంటనే 'పిల్లలందరూ టిఫిన్ తిన్నారా అని అడిగింది. మా దృష్టి ఎపుడూ వాళ్ల కాలేజీకి వచ్చారా లేదా అన్నంతవరకే ప్రసరించేది. వాళ్ల ఆకలి గురించిన ఆలోచనా అంతగా ఉండేది కాదు. ఆ దృష్టితోనే నేను కాలేజీకి రాకపోయినా టిఫిన్‌కు మాత్రం అందరూ వచ్చారమ్మా అని అన్నాను. వెంటనే అమ్మ 'కాలేజికి రానంత మాత్రాన వాళ్ల ఆకలి ఎక్కడకు పోతుంది. ఇంకెప్పుడూ అలా మాట్లాడవద్దు అని మందలించింది. అప్పుడనిపించింది. అమ్మకూ మనకూ ఆలోచనలలో ఎంత వ్యత్యాసమా అని. ఇది నా ఆలోచనలో మార్పు తేవడానికి అమ్మ నేర్పిన పాఠమేనని ఇప్పటికి నాకనిపస్తూ ఉంటుంది.

'ఆకలేసి కేకలేసి నారెందరొ తొల్లి
ఆకులేసి కేకవేసె ఈ అందరి తల్లి
అలనాడు కాశిలో గుడిలోని రాతిబొమ్మ
ఇలనేడు చూశావా గుడిలేని నాతి అమ్మ' అని నదీరా పాడుకున్నట్లుగా మనకు అమ్మలో సాక్షాత్తు ఆ అన్నపూర్ణాదేవియే సాక్షాత్కరిస్తుంది. తన దగ్గరకు వచ్చినవారు మంచి వారయినా, చెడ్డవారయినా, దూషించినా, ద్వేషించినా, హింసించినా వారందరినీ ఆదరించి అన్నం పెట్టిన సంఘటనలు అమ్మ జీవితంలో అనేకం కన్పిస్తాయి. అలాగే కాశీని శపింపబోయిన వ్యాసుని ఆదరించి అన్నం పెట్టింది ఆ అన్నపూర్ణాదేవి.

ఒకసారి పరమేశ్వరుడు కాశీ విశాలాక్షీ మహాదేవితో వ్యాసుని భక్తి ఏ పాటిదో చూతము గానీ ఈతడు భిక్షకు వచ్చిన వేళలలో ఏ ఇంటను అతనికి భిక్ష పుట్టకుండునట్లు చేయవలసినదని ఆదేశించాడు.

వ్యాసుడు శిష్యులతో– నిత్యకృత్యంలో భాగంగా భిక్షార్థమై కాశికానగరంలో

'తిరిగె నింటింట భిక్షాం ప్రదేహియనుచు
బాదరాయణుడీశాను పట్టణమున
నొట్టుపెట్టిన భంగి నే యుగ్మలియును
పిలిచియొక పట్టెడన్నంబు పెట్టదయ్యె.
'వందు చున్నారమను నొక్క వనజనేత్ర
తిరిగి రమ్మను నొక్క లేదీగెబోడి

దేవకార్యంబు నేడను తెరువయోర్తు

ద్వాః కవాటంబు తెఱవదు వనితయొకతె'

ఈ విధంగా రెండవరోజు కూడా భిక్ష దొరకకపోయే సరికి బాధపడి వ్యాసుడు భిక్షాపాత్రమును వీధినట్టనడుమ పగులగొట్టి కోపావేశముతో

'ధనము లేకుండెదరు మూడు తరములందు

మూడు తరముల జెడుగాక మోక్షలక్ష్మి

విద్యయును మూడు తరముల వెడలవలయు

పంచ జనులకు గాశికా పట్టణమున

అని శపించవలెనని ఆలోచిస్తున్నంతలో

'వేదపురాణశాస్త్ర పదవీనదవీయసియైన పెద్దము

త్తెదువ కాశికానగర హాటక పీఠశిఖాధిరూఢ య

య్యాదిమశక్తి, సంయమివరా ! యిటురమ్మని పిల్చె హస్తసం

జ్ఞాదర లీల రత్నకటకాభరణంబులు ఘల్లుఘల్లనన్

అనాదియైన ఆ ఆదిమశక్తి తన చేతితో ఇటురమ్ము అని సంజ్ఞచేసినది. ఆ సంజ్ఞలో ఆదరము ఉట్టిపడుతుండగా ఆమె చేతికి ధరించిన రత్న కంకణములు ఘల్లుఘల్లుమనుచుండగా సంయమివరా అని పిలచినది. ఆదరముతో కూడిన ఆ పిలుపునకు ఆకలిబాధతో మండుతున్న వ్యాసుని హృదయ మొక్కసారి ఘల్లుమన్నది. సాధారణముగా తండ్రికి కుమారుని అవినియంపై ఒక్కొక్కసారి కోపం కలుగవచ్చు. కాని తల్లికి బిడ్డపై అత దెట్టివాడైనను కోపము రాదు. అందులో బిడ్డ ఆకలితో ఉన్నప్పుడు తల్లి అస్సలు ఊరుకోలేదు. వ్యాసుడు ఎంతటివాడయినా ఒక తల్లి కన్నకొడుకే కనుక ఆ ముత్తైయిదువ రూపంలో ప్రత్యక్షమయిన ఆ అన్నపూర్ణాదేవి తన తల్లి తనమంతయు ఉట్టిపడునట్లుగా ముందుగా కాశీని శపించదలచినందుకు చిన్నగా మందలించి ఆకలితో ఉన్నాడు కావున తన ఇంటికి భోజనానికి రమ్మని పిల్చి ఆతనికి ఆతని శిష్యులందరికీ కడుపార భోజనం పెట్టింది. ఆయన ఎంతటి మునీంద్రుడైనా ఆకలి కందరూ సమానమే. కడుపారసి పేట్టే తల్లికి బిడ్డలు ఎనిమిదేళ్ళవాడయినా ఎనభై ఏళ్ళ వాడయినా సమానమే. అందుకే అమ్మఒడిలో గడ్డాల తాతలు కూడా అడ్డాల బిడ్డలుగా ఆదరింపబడ్డారు.

రెడ్డిపాలెం ఆనందాశ్రమ స్థాపకులు లక్ష్మీకాంతయోగి యోగసాధన చేసిన వ్యక్తి. అమ్మకు వైద్యం చేయించే భాగంగానే కొంతమంది ఆహ్వానం మేరకు ఆయన జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మను చూచి గాయత్రి అమ్మవారుగా దర్శించి 'అమ్మా !

గాయత్రీ ఇక్కడ ఉన్నావా ? అని ప్రశ్నించారు. అంతకుముందు ఒకటి రెండు సార్లు వచ్చారు. తరువాత ఆయనకు ఎనభై ఏళ్ళ వయస్సులో మళ్ళీ అమ్మ దగ్గరకు వచ్చారు. అపుడు అమ్మ ఆయనకు అన్నం కలిపి పెట్టింది. ఈ ఎనభై ఏళ్ల ముదిబిడ్డకు అమ్మ అన్నం పెట్టడం, అందులో తనకు పెట్కుటదం విశేషం అన్నారు ఆయన. అందుకు అమ్మ 'ఇందులో విశేషం లేదు నీవు పెద్దవాడివి అని నువ్వు అనుకుంటున్నావు. కాని ఎన్ని సంవత్సరాలు వచ్చిన నువ్వు నాకు బిడ్డవే' అన్నది. అమ్మ అన్నం పెట్టేటప్పుడు అమ్మకు అందరూ పసివాళ్లే వాళ్ల వయస్సుగానే వాళ్ల స్థితిగతులుకానీ ఏ మాత్రం అడ్డురావు – అడ్డుగావు. శ్రీ ప్రభుదత్తబ్రహ్మచారి, స్వామిపూర్ణానంద, శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు, స్వామి అవధూతేంద్ర ఇలా ఎందరో మహానుభావులు అమ్మ చేతిమీదుగా గోరుముద్దలు తిని ఆనందించిన వారే. శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామీజీ (కారంచేడు) సన్యాసాశ్రమ స్వీకార సమయంలో మొదటి భిక్ష అమ్మే పెట్టిందని చెప్పారు.

ఈ కలిలో నాకు ఆకలి లేదు అని చెప్పిన అమ్మకు ఎపుడూ మన ఆకలి గురించి ఆలోచనే. వరంగల్ నుంచి వచ్చే సోదరులు శేషయ్యలింగంగారు వాళ్లు అమ్మ దగ్గరకు వచ్చేటప్పుడు స్వయంగా పిండివంటలు చేసి పెద్ద పెద్ద డబ్బాలతో తీసుకు వచ్చేవారు. ఒకసారి వాళ్లు అలాగే తీసుకువచ్చారు. ఆ రోజులలో వ్యాను ఉండేది. వాళ్లు నాలుగు గంటల వ్యానులో జిల్లెళ్ళమూడి వచ్చారు. అపుడు అమ్మ రవి అన్నయ్య గారింట్లో ఉండేరోజులు. వాళ్లు పిండివంటలున్న ఆ డబ్బాలను తీసుకువచ్చి మేడపైన పెట్టి స్నానాలు చేసి వస్తామని చెప్పి వెళ్లారు. అపుడు సాయంకాలం అయిదవుతుంది. అమ్మ వచ్చి ఆరుబయట కూర్చున్నది. నేను కాలేజీ నుంచి వచ్చి అమ్మ దగ్గరకువెళ్లాను. ఆ సమయంలో అమ్మ దగ్గర ఇంక ఎవ్వరూ లేరు. అమ్మ ఆ డబ్బాలను చూసి వరంగల్ సోదరులు వచ్చారని తెలిసికొని వాళ్ల కోసం కాసేపు ఎదురు చూసింది. 6 గంటలకు సంధ్యావందనం ప్రారంభం అవుతుంది. అందుకని ఈ లోపుగానే ఆ తినుబండారాలను పిల్లలకు పెట్టాలని అమ్మ ఆలోచన. ఇపుడయితే వాళ్ళు కాలేజీ నుంచి వచ్చి ఉంటారు బాగా ఆకలితో ఉంటారు. ఆ తరువాత అయితే సంధ్యావందనం వెంటనే భోజనాల గంట మ్రోగుతుంది. వాళ్లకు తినే అవకాశం ఎక్కడుంటుంది. భోజనానికి ముందు పెడితే మళ్లీ వాళ్లు సరిగ్గా భోజనం చేయరు. అందుకని ఇపుడే పిల్లలు ఉండే హాస్టల్ గదులకు పంపిద్దామని అన్నది. ఆ డబ్బాలకు తాళాలు వేసి ఉన్నాయి. పైగా ఆ సోదరులు వచ్చి నివేదన ఇవ్వాలిగదమ్మా అంటే నాకు నివేదన కంటె పిల్లల ఆకలే నాకు ముఖ్యమని ఎంతో తపనతో నాచేత ఆ తాళాలు తీయించి పిల్లలందరికీ పంచటానికి వాటిని పంపింది. ఆ సమయంలో

అమ్మను చూసిన నాకు ఎందుకమ్మా మా అందరి గురించీ నీకు ఇంత తాపత్రయం అన్పించింది.

మనం దగ్గర ఉన్నప్పుడే కాదు. మనం వేరే ఊరు వెళ్లినా అమ్మకు మన గురించి ఆలోచనే. 1983 వజ్రోత్సవాల సందర్భంగా ఒంగోలులో రావినూతల రామచంద్రారావు గారింట్లో అమ్మ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొనటానికి జిల్లెళ్ళమూడి నుంచి నేను, వరలక్ష్మి మేడంగారు మరికొందరు సోదరులు విద్యార్థినీ విద్యార్థులు కలిసి వ్యానులో ఒంగోలు వెళ్లాము. మరునాడు కార్యక్రమమంతా అయి పిల్లలందరూ వ్యానులో బయలుదేరి వెళ్ళిపోయారు. చివరగా మేడంగారు, నేను ఒకరిద్దరు సోదరులు జీపులో బయలుదేరాం. అప్పటికి రాత్రి బాగా పొద్దు పోయింది. చీరాల వచ్చేటప్పటికే ఒంటిగంట అవుతోంది. మేం భయంభయంగానే బయలుదేరాం. స్టువర్టుపురం దగ్గరకు వచ్చేటప్పటికి రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు పెట్టి ఉన్నాయి. జీపు దగ్గరకు వచ్చిన తరువాత కానీ అవి మాకు కనిపించలేదు. అవి చూసిన మా అందరికీ నోట మాటరాక ముచ్చెమటలతో కంపించిపోయాం. ఎందుకంటే అక్కడ దొంగలు ఇలాగే రోడ్డుకాచి దొంగతనాలు చేస్తుండేవారు. వెనక్కు తిరిగి వెళ్దామన్నా వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో జీపును నడిపే అతనికి ఆశక్తి ఎట్లా వచ్చిందో ఆ ఆలోచనా ఎలా కలిగిందో గాని ఆ రాళ్లపై నుండి జీపును దూకించి శరవేగంతో జిల్లెళ్ళమూడి తీసుకు వచ్చాడు. తెల్లవారిన తరువాత నేను అమ్మ దగ్గరకు వెళ్లాను. ఈ విషయాలేమీ అమ్మకు చెప్పలేదు. మిగిలిన వాళ్లు కూడ ఇంకా ఎవరూ అమ్మ దగ్గరకు రాలేదు. కాని అమ్మ "మీరు రాత్రి స్టువర్టుపురం దగ్గరకు వచ్చేసరికి 1.30 అయింది కదూ అన్నది. అపుడు జరిగిన సంగతంతా అమ్మకు వివరించాను. 'తల్లి రక్షణే కాదు రక్షణే తల్లి' అని చెప్పినట్లుగా అమ్మ మమ్మల్ని రక్షించింది. సాధారణంగా తల్లి తన పిల్లలు బయటకు వెళ్లినపుడు వాళ్లు వచ్చేదాక కళ్లల్లో వత్తులు వేసుకున్నట్లుగా ఎదురు చూస్తూ ఉంటుంది. అలాగే ఆవరణలోని సోదరీ సోదరులు ఎక్కడకు వెళ్లినా వాళ్లు తిరిగి వచ్చేంతవరకూ ఎంతో తపనతో ఎదురు చూస్తూనే ఉండేది.

మా మీద నీకెందుకింత ప్రేమ' అని ఒకరు ప్రశ్నిస్తే మీరు నాకేదో చేయాలని నేనెప్పుడూ అనుకోను. ప్రేమ నాకు సహజం అని ప్రకటించింది. ఒ.వి.జి. సుబ్రహ్మణ్యం గారు షిర్డీ సాయి భక్తులు. అమ్మ వద్దకు చేరి అమ్మలోనే బాబాను దర్శించారు. ఆయన అమ్మ బాబాలు ఇద్దరూ ఒకే శక్తి యొక్క రెండు రూపాలని విశ్వసిస్తూ 'Sai the Mother and Anasuya the Amma' అనే గ్రంథాన్ని రచించారు. అందులో అమ్మ

ప్రేమను గూర్చి 'Amma's Love is bound less grace is ever iffusive and limit less' అని తెలియ చేశారు.

రిచర్డు అమెరికా దేశస్థుడు. అతడు 1975 లో అమ్మ దగ్గరకు వచ్చి కొంతకాలం ఉన్నాడు. అమ్మను గురించి ఒక గ్రంథం ఇంగ్లీషులో ప్రచరణకు సిద్ధం చేసి దానిని మనదేశంలో ముద్రించాలనుకున్నాడు. కాని ప్రభుత్వం ఇక్కడ నివసించడానికి అనుమతి ఇవ్వని కారణంగా అమెరికా వెళ్లి అక్కడ ప్రచురిస్తానని చెప్పాడు. అతను వెళ్లిపోతున్నాడని అమ్మ ఎంతో బాధపడుతుంటే సోదరులు రామకృష్ణ గారు అమ్మతో 'అమ్మా – ఇదీ ఒక విధంగా మంచిదే. ఇంతవరకు నిన్ను గురించిన గ్రంథం ఒక్కటి కూడా విదేశాల్లో ప్రచురితం కాలేదు. ఇతను అమెరికా వెళితే ఆ లోటూ తీరుతుంది అన్నారు. అపుడు అమ్మ అతను ఇక్కడ ఉంగలిగితే ఆ పుస్తకం ముద్రణ కాకపోయినా సరే, ఎన్ని పుస్తకాలు ప్రచురించినా అతనికి ఇక్కడ ఉన్నట్లుగా ఉండదుగా' అన్నారు. అవ్యాజమైన అమ్మ వాత్సల్యాన్ని చవి చూశాడు కనుకనే తాను రచించిన 'Mother of All' అనే గ్రంథంలో అమ్మ ప్రేమను గూర్చి 'Here was the love proclaimed from every roof Top. Yet all feet extinct in practies - Love with out Motives, pure, Self less, without limit' అని తెలియ చేశాడు.

డాక్టర్ పన్నాల రాధాకృష్ణశర్మగారు

'గడ్డము మీసముల్ వయసు కల్గిన పిమ్మట కన్నతల్లియున్
బిడ్డలఁ జేరఁదీసి యొడి పేరిమిలాలన సేయ సందియం
బడ్డము వచ్చునేమొ ? భవదాశ్రితులౌ శతవృద్ధులన్ గరం
బొడ్డుచు నడ్డపాపలుగ నోమెదవమ్మ ! అదేమి చిత్రమో ?
స్త్రీ పురుషాది భేదమునుఁజిన్నయుఁ బెద్దయు నన్న భావమున్
జూపక యెల్లవారల ననూనదయారసభాసురంబులౌ
జూపులఁజూచి శీతల విశుద్ధకరంబున బుజ్జగింపగా
నాపగ జాలరమ్మ ! పరమాద్భుత సమ్మద పారవశ్యముల్' అని అమ్మ ప్రేమామృతాన్ని ఆస్వాదించడం వలన కలిగే పారవశ్యాన్ని తెలియ చేశారు.

అమ్మ వాత్సల్యామృత వర్షంలో మునకలు వేసిన కొండముది రామకృష్ణ అన్నయ్య

'మానవజాతికి నీ వాత్సల్యం తియ్యని చల్లని బహుమతి కాదా
అమ్మా, మా నరజాతికి నీసౌశీల్యం
అరుదౌ చక్కని ఒరవడి కాదా' అని పాడుకున్నారు.

శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి (డాక్టర్ ప్రసాదరాయకులపతిగారు) అమ్మ

వాత్సల్యంలో ఏ రకమైన లౌల్యం లేదు. లౌకిక వాసన కనిపించదు. లౌకిక వాసనలేని అమ్మ దివ్యవాత్సల్యం తన హృదయాన్ని కదిలించి వేసిందని చెప్తున్నారు.

'లౌల్యములేదొకించుకయు లౌకిక వాసనలేదు చిత్తచాం
చల్యము చెందనీ దమృత సాగర శీతలచంద్ర చాంద్రియున్
తుల్యముగాదు నీ నిరత నూతన దివ్యవిచిత్ర పుత్ర వా
త్సల్యము తల్లి ! మా హృదయ సంచయముల్ కదలించి వేసేదున్

ఆ వాత్సల్యజలధిని వర్ణించాలంటే

'పలుకులు రావు నీ పరమవత్సల భావము గూర్చి వర్ణనల్
సలుపుదమన్న - మా ప్రతిభ సర్వము నీ పదపీఠి చెంత
కలగనొ ఏదొ చిన్ని అలగానొ కదుంగదు అల్పమైన య
ట్టులుగనొ తోచు మేమిక నెటుల్ రచియింతుము తల్లి ! నీ కథల్

తన ప్రతిభ సర్వం అమ్మ వాత్సల్య సాగరం ముందు ఏ చిన్న అలగానో, అల్పమైనదిగానో తోస్తున్నదని నిష్కపటంగా అంగీకరించారు.

అమ్మ తన దగ్గరకు వచ్చిన వారిపై మాత్రమే తన ప్రేమామృతాన్ని వర్షించలేదు. తన దగ్గరకు రాలేని వాళ్లకు తానే వెళ్లి దర్శనం ఇవ్వటానికి తన వాత్సల్యాన్ని ప్రకటించటానికి 1973 లో స్వర్ణోత్సవం తరువాత వాత్సల్యయాత్ర పేరుతో పర్యటన చేశారు. ఒకరు ఆ విషయాన్ని ప్రస్తావిస్తే బిడ్డలు తల్లిని చూడటానికి వస్తే ఏముంది? తల్లి బిడ్డలను చూడడానికి వెళితే ఏముంది ? ఏదయినా ఒకటే నంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చింది. అమ్మ ఎక్కడకు వెళ్లినా అక్కడకు ఏదయినా తీసుకు వెళ్లి పంచడం అలవాటు. అమ్మ పర్యటన చేసే కాలంలో కూడా ఎక్కడకు వెళ్లినా ఏదో ప్రసాదం తీసుకుని వెళ్లి అక్కడ అందరికీ పంచడం అమ్మకు ఆనందం. నేను బయలుదేరడానికి చాలా ఉండాలి. ఒక్క గుడిసెకు వెళితే వాడికి పెట్టడానికి తీసుకొని వెళ్లాలి. అమ్మకు ఏమీ పెట్టకపోతినే అని అనుకుని వాడు బాధపడకుండా వాడి చేత పెట్టించుకోవడానిక నేనే తీసుకుని వెళ్లాలి అని చెప్పింది. అమ్మ పర్యటనలో భాగంగా అనేక ప్రాంతాలు సందర్శించింది. ఆ సందర్భంలో నరసాపురంలో ఒక యానాదుల కాలనీకి వెళ్లారు. వారు వారి ఇళ్లనే కాక వారి వీధినంతా శుభ్రంగా చిమ్మి అలంకరించి అమ్మకోసం ఒక వేదిక ఏర్పాటు చేశారు. ఆ వేదికపై అమ్మ ఆసీన కాగానే భక్తితో అమ్మ పాదాలు కడగాలని వారు కోరారు. వెంటనే అమ్మ మీరు రోజూ చేస్తున్న పని అదే. ఈ రోజు ఈ వీధినంతా మీరు శుభ్రం చేసిన దాని కంటే ఈ పాదాలు కడగడం విశేషం కాదు అన్నది

ఈ యాత్రలో భాగమే అమ్మ తమిళనాడు రాష్ట్ర పర్యటన. 1975 ఏప్రియల్ 13వ తేదీన రమణాశ్రమంలో ఉన్న గుడిపాటి వెంకటచలాన్ని చూడడానికి తిరువణ్ణామలైకి వెళ్లారు. అక్కడ చలాన్ని చూసి ప్రేమతో దగ్గరకు తీసుకుని ప్రసాదం పెట్టి కొత్తబట్టలు ఇచ్చి ఆయన కన్నీళ్లు తుడిచి తాను కన్నీళ్లు పెట్టుకుని ఆయనపై అనిర్వచనీయమైన వాత్సల్యాన్ని చూపింది అమ్మ.

సంప్రదాయానికి దూరమైన ఆయనను సమాజం కూడా దూరంగానే ఉంచింది. చలంలో ఉప్పెనలా పొంగిన మానసిక సంఘర్షణ భగవాన్ శ్రీరమణుని దర్శనంలో ప్రశాంతత పొందింది. అందుకే ఏ శక్తికీ లొంగని చలం దివ్యశక్తికి మాత్రమే కట్టుబడి తిరువణ్ణామలైలో స్థిరపడ్డారు. అమ్మ ప్రేమకు కరిగిపోయిన ఆయన అమ్మ అలా ఎదురుగా కూర్చుని ఉంటే 'ఏడిరా నీ ఈశ్వరుడు అని ఎవరయినా అంటే ఇపుడు సమాధానం చెప్పడం చాలా సులభం అన్నారు. మరి ప్రేమకు మించిన దైవం ఎక్కడ ఉంటాడు.

పూవు పుట్టగానే పరమళించినట్లుగా 'అందరూ బిడ్డలే' అన్న భావమే అమ్మ ప్రత్యేకత. కనుక మూడేండ్ల వయస్సులోనే ఒకసారి అమ్మ తల్లి రంగమ్మ గారితో మాట్లాడుతూ నీవు లేనప్పుడు నేనే అమ్మనై ఉంటాగా అన్నది అమ్మ. ఈ మాటే అమ్మ అనంతర జీవితానికి ఉపశ్రుతి అయింది. మాతృప్రేమకు సాటి అయినది మరొకటి లేదు.

లోకమంతటినీ భగవన్మయంగా దర్శించినవారూ, ఆరాధించినవారూ ఉన్నారేమో కాని ఎవరూ అమ్మ లాగా ప్రతివ్యక్తినీ తన బిడ్డగా చూసుకుని ప్రేమించలేదు. లోకంలో ఇదొక మధురమైన భావన. మనోహరమైన ఆరాధన. 'ఆత్మ వత్సర్వభూతాని' అంటే లోకాన్ని తనవలె చూడడం, కాని అమ్మ లోకాన్ని బిడ్డగా ప్రేమించడమనే ఒక క్రొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ దృక్పథంలో నుండి వచ్చిన వాక్యమే "నీ బిడ్డయందు దేనిని చూస్తున్నావో అందరియందు దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం" అని బ్రహ్మస్థితిని పొందడమనేది మనకు ఊహకందని విషయం. గగనకుసుమంలాగా మనకందుబాటులో లేని విషయాలను ఆచరణాత్మక మైన ప్రబోధం ద్వారా మన ముంగిట్లో నిలబెట్టడం అమ్మలో కన్పిస్తుంది.

మన భారతీయ ఋషులు ఎంతో సాధన చేసి కఠోరమైన తపస్సు చేసి అపారమయిన ఆధ్యాత్మిక శక్తిని సంపాదించి అద్భుతమైన, అపూర్వమైన, దర్శనాలనూ శ్రుతులనూ పొంది ఆ పరమసత్యాన్ని లోకానికి అందించారు. ఆ పరమస్థితికీ, చరమగమ్యానికీ, ఉన్నతోన్నత సాధన మార్గమే ఆత్మవత్సర్వభూతాని' అనీ,

సర్వప్రాణులు ఒక దాని కంటె మరొకటి ఏ మాత్రం భిన్నంకావని వేదాంతం చెప్తున్నది. కాని అమ్మ 'పుత్రవత్సర్వభూతాని' అని నిరంతరం తన మాటల ద్వారా, చేతల ద్వారా మనకు అందించిన మహత్తర ప్రబోధం ఇది. సర్వజీవులనూ తన బిడ్డలుగా చూడమనీ మన బిడ్డలను ఎలా ప్రేమిస్తామో అందరినీ అలాగే ప్రేమించమనీ అమ్మ సందేశం. సృష్టిలో సమస్త ప్రాణికోటికీ తనను కన్నవాళ్ల మీద కంటె తాను కన్న వాళ్ల మీదే మమకారం ఎక్కువ. ఒక ముద్ద అన్నం ఉంటే దానిని బిడ్డకు పెట్టి తాను పస్తు ఉంటుంది తల్లి. చూలింతగానూ, బాలింతగానూ బిడ్డకోసం తల్లి చేసే పథ్యమూ, పడే కష్టమూ, తపనా తాపత్రయమూ చూస్తుంటే తల్లికి బిడ్డయందు ఎంత మమకారమో అర్థమవుతుంది. తాము కష్టపడ్డా తమ సంతానం సుఖపడాలని కోరుకుంటారు తల్లిదండ్రులు. మనిషికి తన కంటె ప్రియమైనది సంతానమేనని అందరూ అంగీకరించే విషయమే. అందువల్లనే సర్వసృష్టినీ తన బిడ్డగా చూసుకోవాలనీ అలాగే ప్రేమించాలని అమ్మ నిరంతర ప్రబోధం. ప్రతివాడూ తన కన్నబిడ్డను చూసినట్లుగా సాటివాడిని చూడగల్గిననాడు ప్రపంచంలో కక్షలకూ, కార్పణ్యాలకూ, దౌర్జన్యాలకూ, దురాగతాలకూ, మారణహోమాలకూ తావేది ? మరి ఈ ఇల్లు నాది ఈ ఊరు నాది అనుకోగలరేమో కాని లోకంలో ఉన్న ప్రతివాళ్లను తన బిడ్డలుగా భావించడం ఎట్లా సాధ్యం ? సాధ్యమేనని నిరూపించింది అమ్మ. సర్వసృష్టినీ తనదిగా భావించి ప్రేమించి ఆచరణాత్మకంగా ప్రబోధించింది.

రాగద్వేష అసూయలు మనషికి ప్రబల శత్రువులు. వాటిని జయించడం ఒక్క ప్రేమ ద్వారానే సాధ్యం. ప్రతివారూ మాతృహృదయాన్ని అలవరచుకోగల్గి ప్రేమపూరితమైన మనసు కల్గి ఉంటే అసూయాద్వేషాలకు తావుండదని తాను మనుష్యులపైనే కాదు సర్వజీవులపైనే తన ప్రేమామృతాన్ని వర్షించింది.

అమ్మగదిలో ఒకసారి పిల్లి పిల్లలను పెడితే వాటిని గోతంలో వేసుకుని మరో ఊరిలో వదలిరావడానికి ప్రయత్నం జరిగింది. అంతలో ఆ విషయం అమ్మకు తెలిసి వాటిని స్వేచ్ఛగా వదిలివేయమని ఆదేశించింది. అవి అమ్మ గదిలో ఉండడం వరకు ఎవరికీ అభ్యంతరం లేదు. కాని ఆ పిల్లి పిల్లలకు ఆహారం కోసం రోజూ రాత్రిళ్లు ఎలుకలను చంపి అమ్మ అమ్మ గదిలోనికి తీసుకువచ్చేది. తెల్లవారేసరికి గది అంతా రక్తపుమరకలు, మాంసపుముక్కలు. ఇక ఆదృశ్యాలను చూడలేక ఆ పరిస్థితి సహించలేక వాటిని బయటకు పంపే ప్రయత్నం మళ్లీ జరిగింది. కాని అమ్మ అంగీకరించక 'మీరు బజారుకు వెళ్లారనుకోండి అక్కడ మంచి పండ్లు కనిపిస్తాయి. వాటిని కొనుక్కువచ్చి మీ పిల్లలకు పెడదామనుకోరూ అవీ అంతే. తోటలో మంచి

కూరగాయలను చూస్తే కొనుక్కువచ్చి కూరచేసి మీ పిల్లలకు పెట్టాలని కోరుకోరూ ? ఇవీ అంతే. దాన్ని గురించి ఇంత ఆలోచనా, అల్లరీ ఎందుకు ? అని మందలించింది. ఈ సన్నివేశంలో మాతృత్వపు కోణం నుంచి అమ్మ మనస్సు ఆవిష్కరింపబడింది.

బిడ్డ బురద పూసుకున్నా దాన్ని కడిగి శుభ్రపరచవలసిన బాధ్యత తల్లిది. ఏంచేసినా మారనిదీ, చెదరని ఎక్కడుంటే అదే తల్లితత్వం. ఎక్కడ బాధ్యత నిర్నిబంధంగా స్వీకరించబడుతుందో అదే మాతృతత్వం. అటువంటి తల్లిప్రేమకు మించినదేదీలోకంలో లేదు. కల్తీయుగమైన ఈ కలియుగంలో కల్తీలేని వస్తువే లేదు. తల్లిప్రేమ తప్ప. ఆప్యాయత, ఆర్ధ్రత అమ్మ అనే పదానికి అర్థాలుగా భాసిస్తాయి. అమ్మ, ప్రేమ వేరు వేరు పదాలు కావు. అమ్మ అన్నా, ప్రేమ అన్నా అర్థం ఒక్కటే. అవి పర్యాయపదాలు. తల్లి ప్రేమ అంత గొప్పది కనుకనే బిడ్డకు ఏ కష్టం వచ్చినా తల్లి హృదయం తల్లడిల్లిపోతుంది. అవతార పురుషులయినా ఓ అమ్మకు బిడ్డలే. ఆ అవతారమూర్తికి కష్టం వస్తే ఆ అమ్మ మనసు ఎంత కష్టపడుతుందో.

రామాయణంలో రామలక్ష్మణులు నాగపాశబద్ధులై అచేతనంగా యుద్ధభూమిలో పడి ఉన్నపుడు సీతాదేవి హృదయంలో ఎన్ని తుఫానులు చెలరేగిఉంటాయో ఊహింపవచ్చును. కానీ ఆమె తన దుఃఖము కంటె వృద్ధురాలైన కౌసల్య తల్లి మనసు ఎంతగా తల్లడిల్లిపోతుందో అని ఊహించి దుఃఖించింది.

'నశోచితా తథారామలక్ష్మణంచ మహారథమ్
నాత్మానం జననీం చాపి యథాశ్వశ్రూం తపస్వినీమ్
సాతు చింతయతే నిత్యం సమాప్త వ్రతమాగతమ్
కదాద్రక్ష్యామి సీతాంచ లక్ష్మణంచ సరాఘవమ్'

రాముడు పితృవాక్య పరిపాలనా వ్రతమును పూర్తి చేసికొని సీతాలక్ష్మణ సమేతంగా ఎపుడు వస్తాడా నేనెప్పుడూ నా కన్నులారా అతనిని చూడగలను అని ఆమె ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ విషయం ఆమె కెంతటి కష్టాన్ని కల్గిస్తుందో కదా అని కౌసల్యను తలచుకొని బాధపడింది సీతాదేవి. తల్లి ప్రేమకు సాధారణ వ్యక్తులయినా అసాధారణ వ్యక్తులయినా సమానమే.

అందుకే అమ్మ అందరూ మాతృతత్వాన్ని అలవరచుకొని అందరిని ప్రేమతో ఆదరించండి అని తన జీవితం ద్వారా మనకు సందేశ మందించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రేమసూత్రానికి రసవత్తర వ్యాఖ్యానమే అమ్మ జీవితం. ఆ ప్రేమ ద్వారా

ప్రతిమనిషి మానవత్వ పరిధి నుండి మాధవత్వానికి ఎలా చేరుకోవాలో మానవత్వ, మాధవత్వ నిర్వచనం ద్వారా ధ్వనింప చేసింది. ఈనాడు సమాజంలో స్వార్థం బహుముఖాలుగా దర్శనమిస్తోంది.

'సర్వం స్వార్థం సమీహతే' అని గదా ఆర్యోక్తి తన స్వార్థం కోసం పరులతో పాశవికంగా వ్యవహరించే కాలం. స్వార్థం పరార్థాన్ని, పరమార్థాన్ని అణచి వేస్తుందనేది జగమెరిగిన సత్యం. ఆ స్వార్థం మితిమీరి ఈనాడు ప్రపంచం నుండి దేశం, దేశం నుండి రాష్ట్రం, రాష్ట్రం నుండి గ్రామం, గ్రామం నుండి కుటుంబం తన సంసారం అనే అవస్థలన్నీ దాటి తాను అనే పరిధిలో నిల్చిపోయింది. ఈ ప్రపంచంలో మనమంతా ఉన్నా ఇందులో ఎవరి ప్రపంచం వారిదే. గిరిగీసుకుని ఎవరి పరిధిలో వాళ్లు ఉంటారు. దాన్ని మించి ఆలోచించే శక్తిగానీ, అనుభవంలోకి తెచ్చుకునే ఆసక్తి గానీ ఎవరికీ లేదు. ఇది మానవ లక్షణం, అందుకనే అమ్మ ఆ పరిధుల నుండి మానవుని బయటకు తీసుకువచ్చే ప్రయత్నంలో 'పరిమితమైన మమకారం మానవత్వమనీ, అదే అపరిమితమైతే మాధవత్వమనీ నిర్వచించింది. మానవత్వంలో కొట్టవచ్చినట్లు కన్పించేది పరిమితమైన మమకారం. అదే వృద్ధి చెంది అపరిమితమై సర్వత్ర అల్లుకుని పోయి సర్వజీవరాసులపైనా సమానంగా ప్రసరిస్తే దైవత్వం అవుతుంది.

అతి బాల్యావస్థలోనే అమ్మ తన తాతగారైన చిదంబరరావుగారికీ విషయాన్ని బోధించింది. చిన్నతనంలో ఒకసారి అస్వస్తతతో నానాటికీ శుష్కిస్తున్న అమ్మను చూచి తాతగారు బాధపడతూ ఉంటే 'లోకంలో ఎందరో బాధపడుతున్నారు. నా మీద మీకు గల ప్రేమ అందరి మీద చూపించగల్గితే అందరి గురించి ఈ దుఃఖం పొందగల్గితే మీ దుఃఖం తొలగుతుందనీ, మమకారాన్ని పెంచుకోమనీ' అవధులు లేని ప్రేమను ఉపదేశించింది.

మానవత్వానికి ప్రతీకలుగా, మాతృత్వానికి పతాకాలుగా తన బిడ్డలను తీర్చిదిద్ది నవసమాజ నిర్మాణానికి నాంది పలకాలన్నది అమ్మ ఆశయం. ఆత్మీయత, అనురాగాలకు దూరమై పరితపించే మనిషి మనస్సును తన వాత్సల్యామృత స్పర్శతో సేదతీర్చి మమతల కోవెలగా మలచాలని అమ్మ ప్రయత్నం.

అందుకుందాం అమ్మ ప్రేమసందేశం
అవుదాం అమ్మ భావాలకు వారసులం

***

కృతజ్ఞతలు

విశ్వజననీ ట్రస్ట్ ఆవిర్భావం నుండి అమ్మ సందేశాన్ని సాహిత్యాన్ని నేల నాలుగుచెరగులా వెదజల్లాలనే ఆశయం ఆకాంక్షతో "మదరాఫ్ఆల్" పత్రిక ద్వారా శ్రమిస్తున్న సంగతి అందరెఱిగినదే -

అమ్మ చెక్కిన శిల్పాలలో డాక్టర్ బి.యల్.సుగుణ ఒకరు. తా నార్జించిన విద్యను నలుగురికీ పంచుతూ విద్యాబోధనలో ఆరితేరటమే గాక అమ్మ సాహిత్యంపై సమగ్రపరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ సాధించుకున్నది. దానిలో అంతర్లీనంగా దర్శించిన అమ్మ ప్రేమతత్వాన్ని ఒక గ్రంధంగా తేవటం ప్రశంసించదగినది. సుగుణను రచనకు ప్రోత్సహించి, ప్రచురణకు ఆర్థికంగా హార్దికంగా సహాయసహకారాలందించిన శ్రీ వల్లూరు పాండు రంగారావుగారికి, రచయిత సుగుణకు విశ్వజననీట్రస్ట్, హైదరాబాద్ కృతజ్ఞతలు తెలియచేస్తున్నది.

విశ్వజననీట్రస్ట్ - హైదరాబాద్
201, సువర్ణ అపార్ట్‌మెంట్,
12-7-110 న్యూమెట్టుగూడ
సికింద్రాబాద్ - 500 0017



డాక్టర్ బి.యల్.సుగుణ

తల్లిదండ్రులు: తలగడదీవి సీతారావమ్మ, వెంకటసుబ్బారావు

విద్య : భాషాప్రవీణ, యం.ఎ., సంస్కృతం, యం.ఎ: తెలుగు

పరిశోధన - పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం, హైద్రాబాద్

ఉద్యోగం : తెలుగు లెక్చరర్, మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి, జిల్లెళ్ళమూడి

భర్త : శ్రీ భట్టిప్రోలు రామచంద్ర.

బాల్యంలోనే అమ్మ వద్దకు వచ్చిన ఈ రచయిత మాతృశ్రీ ఓరియంటల్ కాలేజిలో భాషాప్రవీణురాలై, ఆంధ్రాయూనివర్శిటీ నుండి ప్రైవేటుగా తెలుగు, సంస్కృతాలలో రెండు యం.ఎ. పట్టాలు పొందింది. అమ్మ సమగ్ర సాహిత్యంపై తెలుగులో పరిశోధన చేసిన మొదటి వ్యక్తి. చక్కని వాక్చాతుర్యము, ఉపన్యాసవిన్యాసం సుగుణకు అలంకారాలు. విద్యకు తగిన వినయసంపద, అమ్మపట్ల అచంచల విశ్వాసము విద్యాబోధనపట్ల ప్రీతి డాక్టర్ సుగుణలో పండిత పామరులను సైతం ఆకర్షించే లక్షణాలు.

శ్రీ విశ్వజననీట్రస్ట్ - హైదరాబాద్